క్లుప్తంగా

నేడు చెన్నిపాడులో మంత్రి సురేష్ పర్యటన

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు సంగమేశ్వరం దేవస్థానం ట్రస్టు బోర్డు నూతన చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు నాడు–నేడు ద్వారా జెడ్పీ పాఠశాల్లో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభిస్తారు. అనంతరం గ్రామంలో 'పల్లెపల్లెకు సురేష్ అన్న సిద్ధం' కార్యక్రమం నిర్వహించనున్నారు.

వైఎస్సార్ సీపీలోకి 30 మంది చేరిక

టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలెం గ్రామానికి చెందిన 30 మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. సూరారెడ్డిపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు తక్కెలపాటి సుధాకర్ ఆధ్వర్యంలో ఏడు కుటుంబాలకు చెందిన 30 మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మంత్రి సురేష్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి మంత్రి సురేష్ కృషి చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కొండపిలో పార్టీ విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

హనుమంతునిపాడు: రైతులంతా ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఓ గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కొండారెడ్డి సచివాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టపోయినా, పంట చేతికి రాకపోయినా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో దేవకరుణమ్మ, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి

పీసీ పల్లి: రైతులంతా తాము సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని తలకొండపాడులో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి వెంకటస్వామి మాట్లాడుతూ రబీ–2024కు సంబంధించి రైతులు తమ ఆధార్, పంట విస్తీర్ణం పంట పేరు మొదలగు వివరాలతో ఆర్‌బీకేలలో పంట నమోదు చేయించుకోవాలన్నారు. కంది కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బయట మార్కెట్‌లో ఉన్న రేటు ప్రకారం రూ.9,614కు కొనుగోలు చేయడం జరుగుతుందని, కంది రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నూతన ఎంపీడీఓగా సుబ్బారావు


ఎంపీడీఓ సుబ్బారావు

పీసీ పల్లి: పీసీ పల్లి మండల ఎంపీడీఓగా ఏవీ సుబ్బారావు నియమితులయ్యారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పారిశుధ్యం, నీటి సరఫరా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గుడ్లూరు మండలం ఎంపీడీఓగా పనిచేస్తూ పీసీ పల్లికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 391 మంది హాజరు


సింగరాయకొండలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సింగరాయకొండ(మర్రిపూడి): సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. పరీక్షకు 416 మంది విద్యార్థులకుగాను 391 మంది హాజరయ్యారు. తహసీల్దార్ భవాని శంకర్, ఎస్సై శ్రీరాం తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించి స్వయంగా పర్యవేక్షించారు.

దాహార్తి తీర్చేందుకు దాతల చేయూత అభినందనీయం

కనిగిరి రూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసు వద్ద అనన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని చైర్మన్ అబ్దుల్ గఫార్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్ ధనరాజు, వెంకటేష్, యశ్వంత్, నరసింహ, మేలం నారాయణ, మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్కే లతీఫ్, ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను, మాజీ కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసుల యాదవ్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయం కోసం ముందుకు సాగుదాం

- ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులకు దద్దాల పిలుపు


దద్దాల నారాయణయాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

సీఎస్ పురం (పామూరు): రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు చేసుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ పిలుపునిచ్చారు. సీఎస్ పురంలో శుక్రవారం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్యతో పాటు వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టత, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ముందుకు పోవాల్సిన తీరుతెన్నులపై చర్చించారు. అందరి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని ప్రజలకు గుర్తుచేయాలన్నారు. రాష్ట్రంలో మరోమారు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని, లేకపోతే అన్ని నిలిచిపోతాయని ప్రజలు గుర్తించాలన్నారు. ప్రభుత్వ పథకాలను పార్టీ, కులం, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనకు, గత టీడీపీ అరాచక పాలనకు మధ్య తేడాను ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించి తద్వారా సీఎంగా జగన్ గెలుపునకు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాలను ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, కనిగిరి జెడ్పీటీసీ యం.కస్తూరిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి, భూమిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీటీసీ మితికాల గురవయ్య, బొట్లా చిరంజీవి, చీర్లదిన్నె లక్ష్మీనారాయణ, మద్దిశెట్టి నరసింహ, ఎం.భానుతేజ, మర్రి రామయ్య, మోరం మొరార్జి, కాకు నాగేశ్వరరావు, నాలి రామ్మోహన్‌రావు, దనెంకుల నాగేంద్ర, డాక్టర్ గౌస్, పలువురు నాయకులు పాల్గొన్నారు. సింగిల్ విండో చైర్మన్ పెరుగు సుబ్బరామయ్య, ఇర్లా వీరాంజనేయులు, వేల్పుల నారాయణ, బత్తుల శ్రీనివాసులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం


మోపాడులో మెడికల్ కిట్లు అందజేస్తున్న డాక్టర్లు, నాయకులు


టంగుటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


కోటపాడులో మందులు అందజేస్తున్న అధికారులు

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేదలందరికీ మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ దాసరి హరిబాబు, డాక్టర్ భర తెలిపారు. మండలంలోని మోపాడు సచివాలయ పరిధిలోని ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దఫా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామస్థాయి నుంచి మెరుగైన వైద్యసేవలు అందుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కల సాకారమవుతోందన్నారు. డాక్టర్ దాసరి హరిబాబు, డాక్టర్ భరత్, డాక్టర్ గద్దే హేమసుధ, డాక్టర్ నరేంద్రనాథ్‌లు 509 మందికి సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, కంటి సంబంధిత సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం పేషెంట్లకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎస్ నాగేశ్వరరావు, డీఏ మండ్లా చిరంజీవి, హెచ్ఈవో పెరుగు శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ రత్నప్రమీల, నిర్మల, డీఈఓ రాజమోహన్‌రావు, రమేష్, పలువురు నేతలు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి...

పీసీ పల్లి: ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మంజుల తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడతలో భాగంగా శుక్రవారం చింతగుంపల్లిలో వైద్యశిబిరం నిర్వహించారు. 378 మంది రోగులను పరీక్షించారు. అనంతరం 17 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రద్యుష్ కిరణ్, రేణుక దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

పొన్నలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పీహెచ్‌సీ డాక్టర్ రవికిరణ్ పేర్కొన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నెం కొండారెడ్డి, ఎంపీడీఓ కల్పన, పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


చింతగుంపల్లిలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

270 మందికి వైద్య పరీక్షలు

టంగుటూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్ములపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 270 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ ప్రసాద్‌బాబు తెలిపారు. ఇద్దరిని ఒంగోలు జీజీహెచ్‌కు సిఫార్సు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజీ అశోక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 668 మంది విద్యార్థులు హాజరు


పామూరు ఆదిత్య కళాశాల పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు


టంగుటూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఎస్సై

పామూరు: ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పామూరు మండలంలో తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 668 మంది పరీక్షలకు హాజరయ్యారు. పట్టణంలోని 2 కేంద్రాలైన ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదిత్య జూనియర్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించగా, మొదటిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఒకేషనల్ పరీక్షలకు సంబంధించి మొత్తం 728 మంది విద్యార్థులకుగానూ 60 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 354 మందికిగానూ 319 మంది, ఆదిత్య జూనియర్ కళాశాలలో 374 మందికిగానూ 349 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

సీఎస్ పురం మండలంలో 118 మంది హాజరు...

సీఎస్ పురం (పామూరు): స్థానిక కేజీబీవీ పరీక్ష కేంద్రంలో 118 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరైనట్లు సీఎస్ ఇ.నాగభూషణం తెలిపారు. మొదటిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఒకేషనల్ పరీక్షలకు సంబంధించి మొత్తం 128 మంది విద్యార్థులకుగానూ 10 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. పరీక్షలను సీఎస్ ఇ.నాగభూషణం, డీవో మురళి పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభంయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 158 మంది విద్యార్థులకుగాను 152 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. ఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

కందుకూరు: రవాణా శాఖ అధికారుల తనిఖీల్లో పట్టుబడి దీర్ఘకాలికంగా తమ ఆధ్వర్యంలోనే ఉన్న వాహనాలకు సంబంధించి వాటి యజమానులు రానందున ఆ వాహనాలను ఈనెల 6వ తేదీన వేలం వేయనున్నట్లు మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కేయండీ రఫీ శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనే సభ్యులు ఎస్ఆర్‌టీఏ కావలి పేరుపై రూ.5 వేల నగదు డిపాజిట్ లేదా డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం వేలంలో వాహనం దక్కించుకున్న వారు పాడిన మొత్తానికి 18 శాతం వ్యాట్, నిర్దేశిత పార్కింగ్ ఫీజు చెల్లించాలన్నారు. వేలం నిర్వహించిన రోజే బిడ్ రుసుంలో సగం డీడీ లేదా నగదు రూపంలో జమ చేయాలన్నారు. మిగిలిన మొత్తం 15వ తేదీ లోపు చెల్లించాలని చెప్పారు. ఈ విధంగా చెల్లించలేకపోతే ముందుగా చెల్లించిన సగం నగదు కూడా తిరిగి ఇవ్వరని చెప్పారు.

536 మందికి జగనన్న గృహ రిజిస్ట్రేషన్ల పత్రాలు

గుడ్లూరు: జగనన్న కాలనీల్లో గృహాలు పొందిన లబ్ధిదారులకు వాటికి సంబంధించి ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కొర్శిసపాటి బాపిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గృహాలు లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల ద్వారా సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు వాటికి పట్టాలు అందజేస్తున్నారన్నారు. అనంతరం మండలంలో 536 మంది లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలకీర్తి శంకర్, ఆర్ఐ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు చలమారెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు


నారాయణస్వామి మూలవిరాట్

సీఎస్ పురం (పామూరు): మండలంలోని ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆలయంలో 66వ సప్తాహ్నిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నేటి నుంచి ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. 2వ తేదీ ఉదయం వేదపారాయణం, గణపతిపూజ, కలశస్థాపన, మహాసుదర్శనహోమం, రాత్రి 7 గంటలకు పల్లకిసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3న ఉదయం అభిషేకం, రాత్రి 7 గంటలకు శేషవాహనసేవ, గ్రామోత్సవం, 4న ఉదయం మృత్యుంజయహోమం, రాత్రికి అశ్వవాహనసేవ, గ్రామోత్సవం, 5న ఉదయం ఆంజనేయహోమం, రాత్రికి హనుమంతవాహనసేవ, గ్రామోత్సవం, 6న ఉదయం మహాగణపతి, లక్ష్మీగణపతి, సరస్వతి హోమాలు, రాత్రికి గరుడవాహనసేవ, గ్రామోత్సవం, 7న ఉదయం చండీహోమం, రాత్రికి గజవాహనసేవ, గ్రామోత్సవం, 8న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం మహాలక్ష్మీనారాయణ రుద్రహోమాలు, రాత్రికి శాంతి కల్యాణం, హంసవాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతిరోజూ రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విద్యుద్దీపాలంకరణ పూర్తిచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.


మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం

గుడ్లూరు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి నుంచి ఎనిమిది మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం గురువారం రాత్రి దారకానిపాడుకు చెందిన నాగేశ్వరరావు గుడ్లూరులోని మద్యం దుకాణంలో అక్రమంగా మద్యం కొనుగోలు చేసి తరలిస్తున్నాడని సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావు సినిమా హాలు సెంటర్‌లో కాపుకాసి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బొప్పాయిలో మొజాయిక్ వైరస్

- రైతులు అప్రమత్తంగా ఉండాలి


బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన విస్తరణాధికారి

మర్రిపూడి: బొప్పాయి పంటను ఆశించే మొజాయిక్ వైరస్‌పై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన విస్తరణాధికారి ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని అంకేపల్లి గ్రామంలో శుక్రవారం బొప్పాయి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొజాయిక్ తెగులు రసం పీల్చే పురుగులో ఒకటైన పేనుబంక ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ తెగులు ఆకులపైన పసుపు వర్ణం, ఆకుపచ్చ వర్ణం కలిగిన కణజాలం తయారై మొజాయిక్ వైరస్ లక్షణాలు కనిపిస్తాయన్నారు. కాయ పరిమాణం తగ్గి నాణ్యత కోల్పోతుందన్నారు. ఈ తెగులు నివారణకు ఇమిడాక్లోరైడ్ 03 మీ.లీ లేదా దయామిథిర్యామ్ 0.3 మి.లీను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

అర్హులందరికీ ఇళ్లు సీఎం జగన్ లక్ష్యం

- ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి


లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్స్ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీ చేస్తున్న ఆర్డీఓ జాన్‌ఇర్విన్, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: అర్హత కలిగిన వారందరికీ ఇంటి నివేశన స్థలాలు అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా డివిజన్‌లోని సుమారు 13,124 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కన్వేయన్స్‌డీడ్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దార్ ఆవుల సురేష్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పాలవర్తి జాన్ ఇర్విన్ మాట్లాడుతూ డివిజన్‌లోని 13 మండలాల్లో 17,643 పట్టాలు అర్హులకు మంజూరైనట్లు చెప్పారు. వాటిలో 13,124 పట్టాల లబ్ధిదారులు పట్టాల రిజిస్ట్రేషన్ కన్వేయన్స్ డీడ్స్‌కు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. వాటిలో కనిగిరిలో 1,793 పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కన్వేయన్స్ డీడ్స్ అందజేస్తున్నట్లు చెప్పారు. కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో 90 శాతం రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు. ప్రతి సచివాలయంలో లాగిన్ నుంచి వీఆర్వో, సచివాలయ సిబ్బందితో ఈకేవైసీ ద్వారా పట్టాల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ డీడ్లను అందజేయడం జరుగుతుందని, లబ్ధిదారులు వాటిని తీసుకోవాలని తెలిపారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ సొంత ఇల్లు లేక అద్దె ఇంటిలో నివసిస్తున్న వారి కళ్లల్లో ఆనందం నింపేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. పేద వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ ప్రముఖులకు ఇచ్చే విధానంలోనే పూర్తి హక్కులతో రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి నిరుపేదకు ఇంటి పట్టాలు అందజేసి వారి కళ్లల్లో సంతోషం నింపే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల ఫలాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాలతో దేశంలో ఆదర్శ ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్ నిలిచారన్నారు. హెచ్ఎంపాడు, పీసీ పల్లి, సీఎస్ పురం తహసీల్దార్లు కిషోర్ రెడ్డి, ఏ పద్మావతి, ఎస్కే నాగూర్ మీరా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశంలో పాల్గొన్న బాలినేని దంపతులు


గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు

కనిగిరి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) జిల్లా కో ఆర్డినేటర్ బిజ్జం శ్రీనివాసులరెడ్డి పట్టణంలోని ఆర్టీసీ డిపో వెనుక నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ వేడుకల్లో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వీరికి తొలుత వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీలు గుంటక తిరుపతిరెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ పులి శాంతి, ఒమేగా రామిరెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, మండాది కృష్ణారెడ్డి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. గృహప్రవేశ వేడుకల్లో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, కార్పొరేటర్లు, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి


సమస్యల పరిష్కారం కోసం డీటీకి వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

సీఎస్ పురం (పామూరు): నీటి సమస్యల పరిష్కారం కోరుతూ సీఎస్ పురం గ్రామస్తులు, సీపీఎం నాయకులు, మండలంలోని గుంతచెన్నంపల్లి గ్రామస్తులు పలువురు డీటీ సలోమికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి 167బీ తమ పొలాల మీదుగా పోతోందని, పరిహారం ఇవ్వకుండానే పనులు చేస్తున్నారని, తక్షణం పరిహారం ఇప్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డీటీకి పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా గుంతచెన్నంపల్లి రెవెన్యూలో 234 సర్వే నంబర్ భూములకు సంబంధించి తప్పుడు రికార్డులు సృష్టించి తమను మోసం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని గుంతచెన్నంపల్లె గ్రామస్తులు డీటీకి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా 20 సంవత్సరాలకు ముందే అసైన్‌మెంట్ పట్టాలు పొందిన పలువురికి సంబంధించి కొందరికే పూర్తి హక్కులు కల్పిస్తూ పత్రాలు వచ్చాయని, కొందరికి రాలేదని, అందరికీ న్యాయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్కేవై పెదమస్తాన్ వినతిపత్రంలో కోరారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని డీటీ సలోమి తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి భూమిపూజ


ఆదిమూలపు విశాల్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడి తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ తనయుడు విశాల్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆదిమూలపు విశాల్‌ను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, సర్పంచ్ కె.భాస్కర్, ఎంపీటీసీ యు.చిరంజీవి, ఐ.పిచ్చిరెడ్డి, బీవీ భాస్కర్‌రెడ్డి, బి.రమణారెడ్డి, ఎం.నాగయ్య, ఎం.శివరామిరెడ్డి, యు.చెన్నారెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ వెంకటేశ్వరెడ్డి, గురిజాల యేబు, కె.యాకోబు, జి.మరియబాబు, కె.సాల్మన్, డి.సాల్మన్, జి.బుజ్జీ, జి.రత్తయ్య, పి.యహోను, ఒ.చిన్నా, బి.రాములు, కె.యోహాను, ఎం.ఓబులేసు, బి.లోకయ్య, జాన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై కళాజాత


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సభ్యులు

కందుకూరు రూరల్: బేటి బచావో... బేటి పడావో కార్యక్రమంలో భాగంగా కందుకూరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కళాజాత కళాకారులు బాల్య వివాహాలపై మండలంలోని కొండముడుసుపాలెం, మాచవరం, పలుకూరు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళాజాత కళాకారులు వివిధ కథల రూపంలో బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే నష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. పాటలు, ఆటల రూపంలో కూడా వివరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ షరిష్ఠ ప్రకాశం మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపించిన, ప్రోత్సహించినా చట్ట రీత్యా నేరమని చెప్పారు. కచ్చితంగా 18 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు అమ్మాయిలకు వివాహం చేయకూడదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభావతి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.